

పార్క్ పనులు పరిశీలన

ప్రజాశక్తి-కడప అర్బన్

నగర అభివృద్ధి పనుల్లో భాగంగా రాయచోటి అండర్ బ్రిడ్జి పార్క్‌ను సంబంధిత ఇంజినీరింగ్ విభాగ అధికారులతో కలిసి కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్‌చంద్ శనివారం పరిశీలించారు. పార్క్ నిర్మాణ పనులలో భాగంగా ప్రవేశ ద్వారంలో ఏర్పాటు చేసినటువంటి బేవర్స్ క్రమ పద్ధతిలో విధంగా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. పార్క్ పరిసరాలను పరిశీలిస్తూ గ్రీనరీ మరింత ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఫౌంటెన్ పనులను వేగవంతంగా పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పార్క్‌లో డ్రైన్ నీరు సజావుగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పార్క్ పరిసరాల్లో చెట్లను నాటించే విధంగా చర్యలు తీసుకోవాలని హార్టికల్చర్ విభాగ అధికారులకు ఆదేశించారు.

అరటికి ప్రోత్సాహం కరువు

పథకాన్ని రద్దు చేసిన ప్రభుత్వం ఇబ్బందులు పడుతున్న రైతులు

ప్రజాశక్తి-సింహాద్రిపురం

నియోజవర్గంలో సాగుచేస్తున్న అరటికీ ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం కరువు కావడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నియోజవర్గంలోని పులివెందుల, తొండూరు, సింహాద్రిపురం, వేముల మండలాలలో అరటిని 11,500 హెక్టార్లలో సాగు చేస్తున్నారు. మూడు సంవత్సరాల క్రితం హెక్టారుకు మొదటి సంవత్సరం రూ.30 వేలు, రెండవ సంవత్సరం రూ.10 వేలు ప్రభుత్వం ప్రోత్సాహం ఇచ్చేది. ఈ ప్రోత్సాహం అరటి మొక్కల విస్తరణ పథకం కింద అర్హత కలిగిన రైతులకు హెక్టార్ వరకు రాయితీని ప్రభుత్వం ఇచ్చేది. మూడేళ్లుగా ఈ పథకానికి ప్రభుత్వం తూట్లు పడడంతో అరటి సాగు చేసే రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రైతుతో అరటి మొక్కలను కొనుగోలు చేసి సాగు చేసేవారు. రెండు సంవత్సరాల నుంచి పులివెందుల ప్రాంతంలో పండించే అరటికాయలకు విదేశాలలో మంచి గిరాకీ ఉంది. గత ఏడాది రూ.25 నుంచి రూ.30 వేల వరకు ధరలు పలికాయి. రైతులు అరటి సాగుపై ఆసక్తి చూపుతున్నారు. ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం లభించకపోవడం పట్ల రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకుని ఈ పథకాన్ని పునరుద్ధరించాలని రైతులు కోరుతున్నారు.



గురజాలలో సాగులో ఉన్న అరటి పంట

రైతులకు ప్రోత్సాహం ఇవ్వాలి



గత ప్రభుత్వాలు మాదిరిగానే ప్రస్తుత ప్రభు త్వం కూడా అరటి సాగు చేసే ప్రతి రైతును ప్రోత్సహిం చాలి. ప్రోత్సాహం కల్పించడం వలన రైతులు మరింత విస్తీర్ణంలో సాగు చేసే అవకాశం ఉంటుంది. దీని ద్వారా పెట్టుబడి వ్యయం తగ్గి కొంతమేర ఉపయో గకరంగా ఉంటుంది.

- మహేశ్వర్‌రెడ్డి, అరటి రైతు, తెలికి.

పథకాన్ని పునరుద్ధరించాలి

అరటి సాగు చేసే రైతులకు గతంలో ఇస్తున్న రాయితీని ప్రస్తుతం కొనసాగించాలి. రైతులకు కొంతమేర ఉపయో గకరంగా ఉంటుంది. ప్రభుత్వం స్పందించి పునరుద్ధరణ చేయాలి.



- బాలరామిరెడ్డి, అరటి రైతు, గురజాల.

పథకాన్ని నిలిపివేశారు

గతంలో మొక్కల విస్సన్న పథకం కింద అరటి సాగు చేసే ప్రోత్సాహం లభించేది. మూడు సంవత్సరాల నుంచి ఈ పథకాన్ని నిలిపివేయడం జరిగింది. ఈ పథకాన్ని పునరుద్ధరణ చేయాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్న విషయం వాస్తవమే.

- మల్లేశ్వరరెడ్డి, ఉద్యానవన శాఖ అధికారి, ముద్దనూరు.

పారిశ్రామిక రంగం మరింత విస్తృతం

ప్రజాశక్తి-కడప అర్బన్



డిఇఇపిసి సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయ్‌రామరాజు

28 యూనిట్లకు రూ.1.43 కోట్ల మేర రాయితీలు మంజూరు జిల్లాలో పారిశ్రామిక రంగాన్ని పటిష్టం చేసి మరింత విస్తృత పరచాలని కలెక్టర్ వి.విజయ్‌రామరాజు డిఐఈపిసి సభ్యులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాలులో జిల్లా పారిశ్రామిక ఎగుమతులు, ప్రోత్సాహక కమిటీ (డిఐఈపిసి) సమావేశం కలెక్టర్ అధ్యక్షతన నిర్వహి ంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశ్రమలే జిల్లా ఆర్థిక ప్రగతికి ప్రధానం అన్నారు. ఆ దిశగా జిల్లాను పారిశ్రామికంగా అభివృద్ధి పథంలోకి తీసుకు రావాలని సూచించారు. జిల్లాలో పారిశ్రామిక రంగాన్ని మరింత పటిష్టం చేసి జిల్లా ఆర్థిక అభివృద్ధికి దోహద పడడంతో పాటు నిరుద్యోగ యువతకు ఉపాధి, ఔత్సహిక పారిశ్రామిక వేత్తలకు ప్రోత్సాహం అందివ్వాలన్నారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ ఔత్సాహిక నూతన పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేలా పరిశ్రమల శాఖ అధికారులు, బ్యాంకు అధికారులు దృష్టి సారించాలన్నారు. పరిశ్రమల స్థాపన వల్ల వేలాది మంది నిరుద్యోగ యువతకు ఉపాధి లభించడంతో పాటు జిల్లా ఆర్థిక ప్రగతి కూడా మెరుగుపడుతుందన్నారు. పారిశ్రామిక అభివృద్ధి పాలసీ (ఐ.డి.పి.) 2015-20, 2020-23 లను అనుసరించి జిల్లాలో అన్ని సెక్టార్లలోని మొత్తం 28 యూనిట్లకు గాను రూ.1.43 కోట్ల రాయితీ మొత్తం విడుదలకు కమిటీ ఆమోదం తెలిపిందన్నారు. ఈ మేరకు పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ జయలక్ష్మి సంబంధిత వివరాలను సమావేశంలో కలెక్టర్‌కు వివరించగా ఆయా అంశాలపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ రాహుల్ మీనా, కార్పొరేషన్ సూర్య సాయి ప్రవీణ్ చంద్, కమిషనర్ ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ శ్రీనివాస మూర్తి, డిప్యూటీ చీఫ్ కృష్ణ మూర్తి, లీడ్ బ్యాంక్ చీఫ్ మేనేజర్ దుర్గాప్రసాద్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఇఇ ల్, వాణిజ్య పన్నుల శాఖ, ఏపీఎస్ పిడీసీఎల్, లేబర్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల నిరోధానికి పటిష్ట చర్యలు

కడప : మత్తుపదార్థాల వినియోగం, విక్రయాలు, రవాణాను అరికట్టడానికి జిల్లాలో పటిష్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ వి.విజయ్ రామరాజు సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ బోర్డు మీటింగ్‌లో జిల్లాలో మత్తు పదార్థాల నివారణ, మాదక ద్రవ్యాల అక్రమ రవాణా నిరోధంపె కలెక్టర్ వి.విజయ్ రామరాజు అధ్యక్షతన జాయింట్ యాక్షన్ కమిటీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎస్‌పి అన్బురాజన్, నగర కమిషనర్ జి.ఎస్.ఎస్. ప్రవీణ్ చంద్, అసిస్టెంట్ కలెక్టర్ రాహుల్ మీనా, డిఆర్‌ఒ గంగాధర్ గౌడ్‌తో కలిసి జిల్లా కలెక్టర్ సంబందిత శాఖల అధికారులకు పలు సూచనలు, ఆదేశాలు ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల మూల సరఫరా రవాణాను అరికట్టేందుకు జిల్లాలో పటిష్టమైన నిఘా చర్యలు అవలంబించాలని తెలిపారు. విద్యార్థులు, ఆటో డ్రైవర్లు, వర్కర్లను లక్ష్యంగా చేసుకుని సరఫరా జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని చెప్పారు. మాదకద్రవ్యాలు విక్రయాలు జరిగే చోట గట్టి నిఘా ఉంచాలన్నారు. మాదకద్రవ్యాల బారిన పడిన బాధితుల పట్ల సున్నితంగా వ్యవహరించాలని పోలీస్ శాఖకు సూచించారు. బాధితులకు కౌన్సెలింగ్ నిర్వహించడంతో పాటు పునరావాసం కల్పించాలని అన్నారు. జిల్లాలో ప్రతి మెడికల్ షాప్‌లోనూ సిసి టివి కెమెరాలు ఏర్పాటుచేసి నిషేధిత మందుల అమ్మకాలను అరికట్టడంతో పాటు '18 సం లోపు బాలలకు డాక్టర్ ప్రెస్క్రిప్షన్ లేకుండా ఎలాంటి మందులు ఇవ్వబడవు !' అనే సూచిక బోర్డ్‌లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. స్కూల్స్, కళాశాల డాబాలలో, ఇంజినీరింగ్, మెడికల్ కళాశాలలో బోర్డులు మత్తు పదార్థాల నివారించే చర్యలపై పోస్టర్లను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవోలు ధర్మచంద్రారెడ్డి, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, వెంకటరమణ, పోలీసు, ఎక్సైజ్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అంబవరం ప్రభాకర్‌రెడ్డి

వివరాలు నమోదు చేయాలి : పిఒ

ప్రజాశక్తి-కడప ప్రతినిధి


ప్రతి ఉపాధ్యాయుడూ ప్రశస్త్ యాప్‌ను డౌన్ లోడ్ చేసుకొని అందులో విభిన్న ప్రతిభవంతుల వివరాలను నమోదు చేయాలని సమగ్ర శిక్ష పథకాధికారి డాక్టర్ అంబవరం ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం కడప నగరంలోని మండల వనరుల కార్యాలయంలో ఐఈఆర్‌పిలకు ప్రశస్త్ యాప్ నమోదు పైన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతుల వివరాలను యూడైస్ అప్లోడ్ చేయాలన్నారు. విభిన్న ప్రతిభావంతుల గుర్తింపుకై సోమవారంనుంచి స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని, ప్రతి ఐఇఆర్‌పి ఫేషియల్ రికగ్నిషన్లో అటెండెన్స్ నమోదు చేయాలన్నారు. సహిత విద్యా సమన్వయకర్త మిట్టాకేశవరెడ్డి మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులను పాఠశాలల్లో చేర్పించాలని, వారి చేరికను ఏ ప్రధానోపాధ్యాయుడు నిరాకరించకూడదని అందుకు సంబంధించిన ప్రభుత్వ ఉత్తర్వులను గురించి వివరించారు. బడి బయట ఉన్న విభిన్న ప్రతిభావంతులను గుర్తించి సమీప పాఠశాలలో చేర్పించడం యుడైస్లో నమోదు చేయించడం ప్రతి రిసోర్స్ పర్సన్ యొక్క బాధ్యతగా భావించాలన్నారు. సహాయక సహిత విద్యా సమన్వయకర్త రమణమూర్తి మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతుల విద్యార్థుల చేరికను బట్టి జిల్లాకు బడ్జెట్ కేటాయించబడుతుందన్నారు. కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా సహిత విద్యా సమన్వయకర్త జనార్ధన్ రిసోర్స్ పర్సన్లు తామడిగిన వివరాలను సకాలంలో కార్యాలయానికి అందించేలా సిద్ధంగా ఉండాలన్నారు. **కోటయ్య సేవలు మరువలేనివి...** విభిన్న ప్రతిభావంతుల సేవలో దాదాపు 20 ఏళ్లకు పైగా విధులు నిర్వహించి విరమణ చేసిన విభిన్న ప్రతిభావంతుల రిసోర్స్ పర్సన్ కోటయ్య సేవలు అపూర్వమైనవని అంబవరం ప్రభాకర్ రెడ్డి, మైనారిటీ కార్పొరేషన్ ఈడీ డాక్టర్ వల్లూరు బ్రహ్మయ్య పేర్కొన్నారు. మండల వనరుల కేంద్రంలో కోటయ్య విరమణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి వారు మాట్లాడుతూ కోటయ్య విధి నిర్వహణలో విభిన్న ప్రతిభావంతులకు ప్రత్యేక విద్యతోపాటు, అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారని చెప్పారు. చాపాడు, బ్రహ్మంగారిమఠం, మైదుకూరు తదితర ప్రాంతాలలో విభిన్న ప్రతిభావంతుల విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇప్పించడంతోపాటు వారికి ప్రభుత్వ పథకాలు అందేలా చేయడంలో విశేష కృషి చేశారని కొనియాడారు.

సాయి సూర్యతేజరెడ్డి డబుల్ సెంచరీ

కడప : కర్నూలు జట్టు కెప్టెన్ ఏ. సాయి సూర్య తేజ రెడ్డి డబుల్ సెంచరీ (201 పరుగులు) చేయడంతో మొదటి ఇన్నింగ్స్‌లో కర్నూలు జట్టు 395 పరుగుల భారీ స్కోరు సాధించింది. శనివారం కెఒఆర్ఎం క్రికెట్ మైదానంలో కర్నూలు, నెల్లూరు జట్ల మధ్య మ్యాచ్ ప్రారంభమైంది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన కర్నూలు జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 77.4 ఓవర్లలో 395 పరుగులకు ఆలౌట్ అయింది. ఆ జట్టు కెప్టెన్ ఏ.సాయి సూర్యతేజారెడ్డి బ్యాటింగ్‌లో అద్భుతంగా రాణించాడు. 196 బంతులను ఎదుర్కొని 26 బౌండరీలు, 5 సిక్సర్ల సాయంతో 201 పరుగులు(డబుల్ సెంచరీ) చేశాడు. ధనుష్ నాయుడు 61 పరుగులు చేశాడు. నెల్లూరు జట్టులోని సుతేజ్ రెడ్డి 3, భార్గవ్ మహేష్ 3 వికెట్లు తీసుకున్నారు. అనంతరం బ్యాటింగ్ కు దిగిన నెల్లూరు జట్టు మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 5.0 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 17 పరుగులు చేసింది.

ఘనంగా శంకరరావు జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - కడప



సంబరాలు చేసుకుంటున్న బిసి నాయకులు

బిసిసంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేశన శంకరరావు జన్మదిన వేడుకలను శనివారం స్థానిక జిల్లా బిసి సంక్షేమ సంఘం కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి కేశన శంకరరావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా అమ్మఒడి అనాథ శరణాలయంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు బత్తల లింగమూర్తి, రాష్ట్ర ఉపాధ్యక్షులు బంగారు నాగయ్య యాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ గోవింద్ నాగరాజు, గౌరవ అధ్యక్షులు గురుస్వామి, గౌరవ సలహాదారులు ఖాదర్‌బాషా, జిల్లా ప్రధాన కార్యదర్శి శివ, మహిళా అధ్యక్షులు వల్లూరు నారాయణమ్మ, జిల్లా ఉపాధ్యక్షులు కళ్యా సుధాకర్, పస్తం అంజి, సిఆర్‌ఐ సునీల్ జయంత్, ధనలక్ష్మీ, జయలక్ష్మి, త్రివిక్రమ్ రావు, రామచంద్రయ్య, వెంకట లక్ష్మమ్మ, నాయకులు పాల్గొన్నారు.

సత్వర న్యాయ పరిష్కారం : జిల్లా జడ్జి అన్నపూర్ణ

ప్రజాశక్తి - కడప



మాట్లాడుతున్న జిల్లా జడ్జి పి.అన్నపూర్ణ

పర్మినెంట్ లోక్ అదాలత్ (పిఎల్ఎ) ద్వారా ఫిర్యాదు దారులు ఎలాంటి కోర్టు ఖర్చులు లేకుండా సత్వర న్యాయ పరిష్కారం పొందవచ్చని జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.అన్నపూర్ణ పేర్కొన్నారు. శనివారం స్థానిక జిల్లా జిల్లా కోర్టు ప్రాంగ ణంలోని న్యాయ సేవాసదన్ భవనంలో 'శాశ్వత లోక్ అదాలత్" ఆధ్వర్యంలో పర్మనెంట్‌లోక్ అదాలత్ చైర్మన్ ఎస్. ప్రసాద్ అధ్యక్షతన ప్రజా ప్రాయోజిత సేవా రంగాల్లో న్యాయ సేవలపై పారా లీగల్ వాలంటీర్లకు అవగాహన కార్యక్రమం నిర్వ హించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా ప్రధాన న్యాయ మూర్తి తోపాటు జిల్లా అదనపు జడ్జి కవిత హజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ శాశ్వత లోక్ అదాలత్‌ను ఇద్దరు వ్యక్తుల మధ్య వివాదానికి సంబంధించిన కేసును కి ఎలాంటి కోర్టు ఖర్చులు లేకుండా సత్వర న్యాయ పరిష్కారం అందించే ఉద్దేశంతో ఏర్పాటు చేశామన్నారు. పర్మినెంట్ లోక్ అదాలత్ అందించే తీర్పు భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు ఇచ్చే తీర్పుతో సమానమన్నారు. పర్మనెంట్ లోక్ అదాలత్ చైర్మన్ ఎస్. ప్రసాద్ మాట్లాడుతూ ఈ తీర్పుకు ఎలాంటి అప్పీలు లేదని, దీని ద్వారా 10 రకాలైన ప్రజా ప్రయోజిత సేవా రంగాలకు సంబంధించిన సేవలలో ఎలాంటి అవాం తరాలు, లోపాల వల్ల జరిగే నష్టాలకు సంబంధించి త్వరితగతిన న్యాయ పరిష్కారం పొంద వచ్చన్నారు. జిల్లా అదనపు జడ్జి మాట్లాడుతూ సాధారణ లోక్ ఆదా లత్‌లో ఇప్పటికే ఎన్నో కేసులను పరిష్కారమయ్యాయని తెలిపారు. మరిన్ని పూర్తి వివరాలకు జిల్లా కోర్టు ఆవరణలోని పర్మనెంట్ లోక్ అదాలత్ కార్యాలయంలో సంప్రదించవచ్చని లేదా సెల్ 8639684279, 996373169కు ఫోన్ చేసి సరైన అవగాహన పొందవచ్చని తెలియజేశారు.

కొప్పోలిలో కంటి వైద్య శిబిరం

వల్లూరు : జగనన్న కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న కంటి వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డిఎంహెచ్‌ఒ డాక్టర్ కె. నాగరాజు పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని కొప్పోలి సచివాలయంలో ఏర్పాటు చేసిన కంటి వైద్య శిబిరాన్ని ఆయన పరిశీలించారు. ఈ వైద్య శిబిరంలో 70 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. 50 మందికి మందులు పంపిణీ చేశారు. వారికి త్వరలో కంటి అద్దాలు అందిస్తామన్నారు. గర్భిణులు, బాలింతలు, వైఎస్ఆర్ క్లినిక్‌లో తగు సలహాలు, సూచనలు తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ ఫణీంద్ర, ఎంఎంఒ వెంకటరెడ్డి, ఎంపిఎంఇఒ ప్రసాద్, సిహెచ్‌ఒ సునీల్, సిహెచ్‌ఓ వేణుగోపాల్, ఎఎన్ఎం సుధా, సచివాలయ , వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పరిశోధన ఫలితాలు భవిష్యత్తుకు మార్గాలు : విసి

కడప అర్బన్ : పరిశోధనా ఫలితాలు సక్రమంగా వినియోగిస్తే స్కాలర్ల భవిష్యత్తుకు మార్గాలు అవుతాయని యోగి వేమన విశ్వవిద్యాలయం వి సి ఆచార్య చింతా సుధాకర్ అన్నారు. శనివారం 'పరిశ్రమ-అకాడెమియా లెక్చర్ సిరీస్ 'లో భాగంగా అనువాదాలు, పరివర్తనలు, విద్యావేత్తలు అనే అంశంపై విశ్వవిద్యాలయ రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ సంచాలకులు ఆచార్య చంద్ర ఓబులరెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక ఉపన్యాస కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన వి సి ఆచార్య చింతా సుధాకర్ మాట్లాడుతూ స్కాలర్లు వారి పరిశోధన ఫలితాలే సమాజ ప్రయోజనాలకు వినియోగించేలా ఆలోచించాలన్నారు. ప్రధాన ఆచార్యులు ఎస్ రఘునాథరెడ్డి మాట్లాడుతూ అకడమిక్ నుంచి మార్కెట్లో నిలబడేలా మెలకువలను వివరించారు. కార్యక్రమంలో ఆచార్య చంద్రమతి శంకర్, ఆచార్య చంద్రశేఖర్, ఆచార్య ఎల్ వి రెడ్డి, ఆచార్య మధుసూదన్ రెడ్డి, డాక్టర్ మాధవరెడ్డి, డాక్టర్ ముని కుమారి, డాక్టర్ ప్రశాంతి, డాక్టర్ రియాజున్నీసా, పరిశోధకులు విద్యార్థులు పాల్గొన్నారు.

'కలియుగం పట్టణంలో' టైటిల్ పోస్టర్ విడుదల

ప్రజాశక్తి - కడప అర్బన్

నాని మూవీ వర్క్స్ అండ్ రామా క్రియేషన్స్ పతాకంపై విశ్వ కార్తికేయ, ఆ యుషి పటేల్ హీరో హీరో యిన్లుగా రమాకాంత్ రెడ్డిని దర్శకుడిగా పరిచయం చేస్తూ డాక్టర్ కె.చంద్ర ఓబుల్ రెడ్డి, జి మహేశ్వరరెడ్డి, కాటం రమేష్ కలిసి సంయుక్తంగా నిర్మిస్తున్న ప్రొడక్షన్ నంబర్ 1గా 'కలియుగం పట్టణంలో' అనే సినిమాను నిర్మి స్తున్నారు. శనివారం ఈ సినిమాకు సంబంధించిన టైటిల్ లోగో పోస్టర్‌ను కెఒ ఆర్ఎం కళాశాలలోని ఆడిటోరియంలో ఆవిష్కరించారు. డిప్యూటీ సీఎం అంజద్ బాషా చేతుల మీదుగా మూవీ టైటిల్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ఈ ఈవెంట్‌కు కెఎస్ఆర్ఎం కళాశాల ఎమ్‌డి కందుల చంద్ర ఓబుల్ రెడ్డి, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాస రెడ్డి, ఏపీ ఇండస్ట్రీస్ అడ్వైజర్ రాజోలి వీరరెడ్డి, ప్రొద్దుటూరు మాజీ ఎమ్మెల్యే లింగా రెడ్డి, నాగార్జున స్కూల్ చైర్మన్ శివ శంకర్ రెడ్డి, ఆర్ఎల్‌టీ గ్రూప్ చైర్మన్ అమీర్ బాబు, ఒంటేరు శ్రీనివాస్ రెడ్డి, ఏ కే జెడ్ జువెల్లర్స్ చైర్మన్ అఫ్జల్‌ఖాన్, చిన్నపురెడ్డి, టిడిపి ఆర్గనైజింగ్ సెక్రటరీ గోవర్దన్ రెడ్డి హాజరయ్యారు.



టైటిల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

అర్హతే ప్రామాణికం : డిప్యూటీ సిఎం

కడప అర్బన్ : అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని డిప్యూటీ సీఎం అంజాద్ బాషా అన్నారు. శనివారం నగరంలోని 38,35,24వ డివిజన్లలోని సచివాలయాలలో 'జగనన్న సురక్ష' శిబిరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వంలో జగనన్న సురక్ష కార్యక్రమంతోనే పేదలకు సంక్షేమ పథకాలు అందించి ఎంతో మేలు చేకూరుతుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో అర్హత ఉన్న ఏ ఒక్కరి నోటా ప్రభుత్వ పథకాలు అందలేదనే మాట రాకూడదని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ నిత్యానంద రెడ్డి, సోషల్ వేల్ఫేర్ బోర్డ్ చైర్మన్ పులి సునీల్ కుమార్, మార్కెట్ యార్డు చైర్మన్ బంగారు నాగయ్య, వైస్ చైర్మన్ ఇబ్రహీం మియా, స్థానిక కార్పొరేటర్లు ఇతర కార్పొరేటర్లు షేక్ మహమ్మద్ షఫీ, నరపురెడ్డిసుబ్బారెడ్డి, తోటకృష్ణ, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

సమన్వయంతోనే మండలాభివృద్ధి : ఎంపిపి

ప్రజాశక్తి-చెన్నూరు



మాట్లాడుతున్న ఎంపిపి చీర్ల సురేష్‌యాదవ్

అధికారులు, ప్రజా ప్రతినిధులు సమ న్వయంతో కలిసి పని చేసిన ప్పుడే గ్రామాల్లో, మండలంలోని సమ స్యలు పరిష్కారం అవుతా యని ఎంపిపి చీర్ల సురేష్ యాదవ్ అన్నారు. శనివారం మండల సభా భవనంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన మాటా ్లడుతూ ముఖ్య మంత్రి గ్రామాల అభివృద్ధికి కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్నారని తెలిపారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో ఆ నిధులు ఖర్చు చేస్తూ గ్రామాల అభివృద్ధి కృషి చేయాలని కోరారు. కమలాపురం శాసనసభ్యులు రవీంద్రనాథ్‌రెడ్డి మండల అభివృద్ధికి కోట్లాది రూపాయలు మంజూరు చేయిస్తూ అభివృద్ధిని పరుగులు పట్టిస్తున్నారని ఆయన తెలిపారు. అన్ని శాఖల అధికారులు తమ నివేదికను సమావేశం నివేదించారు. గత సమావేశంలో తమ దృష్టికి వచ్చిన సమస్యలు పరిష్కరించినట్లు, ఉప్పరపల్లె కాలువలో పూడిక తీయాలని ఉపాధి హామీ అధికారులను కోరారు. చెన్నూరులోని బాలుర జడ్‌పి హైస్కూల్‌లో నాడు- నేడు పనులు జరగడంలేదని కో - ఆప్షన్ సభ్యుడు సభ దృష్టికి తీసుకురాగా నాబార్డ్ నిధుల వల్ల ఆలస్యమవుతుందని తొందరగా వాటిని పూర్తి చేస్తామని ఎంఇఒ గంగిరెడ్డి వివరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి ఆర్ఎస్ఆర్(చిన్న), అడవి శాఖ డైరెక్టర్ రమణ శ్రీలక్ష్మి, మండల వ్యవసాయ సలహాదారుడు ఎర్ర సాని మోహన్ రెడ్డి, సర్పంచుల సంఘం అధ్యక్షుడు ఎస్వి నారాయణరెడ్డి, కొండపేట సర్పంచ్ తుంగ చంద్రయాదవ్, సుదర్శన్ రెడ్డి, పార్టీ నాయకులు సాదిక్, ఎంపీడీవో సురేష్ బాబు, వైద్యాధికారి చెన్నారెడ్డి, హౌసింగ్ ఎఇ మిలిన్, పంచాయతీ కార్యదర్శి రామ సుబ్బారెడ్డి, శ్రీనివాసులు, సుధీర్ పలు అధికారులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

వైసిపి కువైట్, గల్ఫ్ కన్వీనర్లకు సన్మానం

ప్రజాశక్తి - కడప



బాలిరెడ్డి, గోవిందు నాగరాజును సన్మానిస్తున్న నాయకులు

వైసిపి కువైట్ కన్వీనర్‌గా మరోసారి ఎన్నికైన ముమ్మడి బాలిరెడ్డి, గల్ఫ్ కో- కన్వీనర్‌గా ఎన్నికైన గోవిందు నాగరాజును శనివారం కువైట్ హవెలి ప్రాంతంలో ఉన్న ఆర్.ఆర్. హోటల్ వద్ద వైసిపి మైనార్టీ నాయకులు షేక్. రహమతుల్లా, జగన్ యూత్ ఫోర్స్ అధ్యక్షులు ఏ. లక్ష్మి ప్రసాద్ యాదవ్, రహమతుల్లా, ప్రసాద్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బాలిరెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకంతో మరోసారి కువైట్ కన్వీనర్‌గా నియమించిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి, సహకరించిన రాజ్యసభ సభ్యులు వి. విజయసాయి రెడ్డి, ఎన్ఆర్ఐ గ్లోబల్ కన్వీనర్ మేడపాటి వెంకట్, గల్ఫ్ కన్వీనర్ ఇలియాస్, అందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. కార్యకర్తను పార్టీ ఎప్పుడు కూడా మర్చిపోదు అనడానికి ఉదాహరణ గల్ఫ్ కో కన్వీనర్‌గా ఎన్నికైన గోవిందు నాగరాజు అని తెలిపారు. గ్లోబల్ కన్వీనర్ మేడపాటి వెంకట్ సలహా, సూచనల పైన కువైట్‌లో త్వరలో కొత్త కమిటీని ప్రకటిస్తామన్నారు. కార్యక్రమంలో కువైట్ కమిటీ సభ్యులు, పార్టీ అభిమానులు పాల్గొన్నారు.

యువతలో నైపుణ్యం పెంపొందించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్



మాట్లాడుతున్న పీడీ ఆనంద్‌నాయక్

యువతలో నైపుణ్యం పెంపొందించడం ముఖ్యమని డిఆర్‌డిఎం పీడీ ఆనంద్‌నాయక్ అన్నారు. శనివారం ప్రపంచ యువజన నైపుణ్యాల దినోత్సవం స్థానిక నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువకులను ఉపాధి, నైపుణ్యాలతో సన్నద్ధం చేయడం అవసరమన్నారు. ప్రపంచం మెల్లగా సుస్థిర అభివృద్ధి వైపు మళ్లుతున్న నేపథ్యంలో యువతలో నైపుణ్యం పెంపొందించడం ఎంతో అవసరమని తెలిపారు. శిక్షణ పొందుతున్న విద్యార్థిని, విద్యార్థులకు వివిధ అంశాల మీద ఎస్సే కాంపిటీషన్ , మ్యూజికల్ చైర్స్, ఖోఖో, కబడ్డీ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జెడిఎం వేణుమాధవ్, గోపి, నిహార్‌స్కిల్ ఎడ్యుకేషన్ మేనేజింగ్ డైరెక్టర్ ఇంతియాజ్ అహ్మద్, సిబ్బంది సుబ్బరామిరెడ్డి, తేజ, నరసింహ,అలీ, కళ్యాణి పాల్గొన్నారు.

పాలకుల చెవిలో శంఖం ఊదడమే

కడప అర్బన్ : చెవిటి పాలకుల చెవిలో శంఖం ఊదిన చందంగా ప్రజా నిరసనలు ప్రభుత్వాల ముందు ఉన్నాయని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జి.చంద్రశేఖర్ విమర్శించారు. శనివారం సిఐటియు జిల్లా కార్యాలయంలో నగర కార్యదర్శి వెంకటసుబ్బయ్య అధ్యక్షతన నియోజకవర్గ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోడీ బిజెపి ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను, ప్రజల సంపదను దేశ సంపదను శతకోటేశ్వర్ల పాలు చేస్తోందని విమర్శించారు. దేశంలోని శతకోటేశ్వరులకు ప్రజల పన్నులు, ప్రజలు దాచుకున్న పొదుపులు, ప్రజల ఉమ్మడి ఆస్తులు కారు చౌకగా అప్పగించి వారి నుంచి ఎన్నికల ప్రయోజనాలు, నిధులు సమీకరిం చుకుంటున్నారని ఆరోపించారు. దేశంలోని 18 లక్షల వ్యవసాయ విద్యుత్ పంపు సెట్లకు స్మార్ట్ మీటర్లు పెట్టి ప్రజాధనాన్ని దోచుకోవడానికి ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. సమావేశంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు రెడ్డి, నగర అధ్యక్షులు చంద్రారెడ్డి, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు రవి, నాగరాజు, ఐ.ఎం.ఎల్. నాయకులు, అంగన్వాడి, విఆర్.ఎ, ఆశ, అనుబంధ కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

నిర్ణీత గడువులోగా సమాచారం ఇవ్వాలి

ప్రజాశక్తి - కడప



నిరసన తెలియజేస్తున్న నాయకులు

సమాచార హక్కు చట్ట ప్రకారం అడిగిన సమాచారాన్ని నిర్ణీత గడువులోపు ఇవ్వని అధికారులపై తగు చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ హ్యూమన్ రైట్స్ జిల్లా అధ్యక్షులు పాలగిరి శివ డిమాండ్ చేశారు. శనివారం కాంగ్రెస్ పార్టీ హ్యూమన్ రైట్స్ జిల్లా అధ్యక్షులు పాలగిరి శివ ఆధ్వర్యంలో చింతకొమ్మదిన్నె రెవెన్యూ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తు చేసుకున్న పౌరులకు స్వచ్ఛందంగా సమాచారాన్ని 30 రోజుల గడువులోగా ఇవ్వాలని తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాల నుంచి కావాల్సిన సమాచారాన్ని స్వచ్ఛందంగా తీసుకునే హక్కు ఈ చట్టం కల్పించింది అని అన్నారు. చట్టం ప్రకారం అడిగిన సమాచారాన్ని రోజులు గడుస్తున్న ఇవ్వకుండా వారి కార్యాలయం చుట్టూ తిప్పుకుంటూ అధికారులు నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తున్నారని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షులు విష్ణు ప్రీతంరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి చీకటి చార్లెస్, యూత్ కాంగ్రెస్ జాతీయ సమన్వయకర్త విజయ్ సుశీల్‌కుమార్, యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు మధు రెడ్డి, లేబర్ డిపార్ట్మెంట్ జిల్లా అధ్యక్షులు చెప్పలి పుల్లయ్య, ఎన్ ఎస్ యు ఐ జిల్లా అధ్యక్షులు మామిళ్ళ బాబు, నగర మహిళా అధ్యక్షురాలు లావణ్య, ఆర్టీఐ డిపార్ట్‌మెంట్ వినయ్‌కుమార్, మానవ హక్కుల సంఘం జిల్లా సెక్రెటరీ డప్పు చంద్ర, జనరల్ సెక్రెటరీ బి రాజేష్ కుమార్ పాల్గొన్నారు.

పోలికేక

ప్రజాదృష్టి

ఉమ్మడి జిల్లాలోని అంగన్వాడీల పోలికేక ప్రతిధ్వనించింది. తమ న్యాయబద్ధమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ కలెక్టరేట్ ఎదుట 36 గంటల పాటు చేపట్టిన నిరసన దీక్ష జయప్రదమైంది. జిల్లాలోని సుమారు ఏడు వేల మందికిపైగా అంగన్వాడీలు కలిసికట్టుగా చేపట్టారు. అంగన్వాడీల పోరాటానికి ఇంటి దగ్గర నుంచి భోజనాలు తెచ్చుకుని నిరసన పథానికి సంకల్పం చేశారు. 2019 సార్వత్రిక ఎన్నికల ప్రచారం సందర్భంగా ప్రతిపక్ష నాయకుని హోదాలో ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేయాలని చేయాలని కోరుతూ అంగన్వాడీల డిమాండ్ న్యాయబద్ధమైనది. ఇటువంటి న్యాయమైన డిమాండ్లను పాలకులు చిత్తశుద్ధితో నెరవేర్చాల్సిన అవసరం ఎంతైనా ఉంది. సమానపనికి సమాన వేతనం ఇవ్వాలని, కనీస వేతనం రూ.26 చెల్లించాలని, తెలంగాణ తరహాలో వేతనాలు ఉండాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని, అంగన్వాడీలకు ప్రమోషన్లు ఇవ్వాలని నినదించారు. 1985లో అంగన్వాడీల వ్యవస్థ ఆవిర్భావం నుంచి అంగన్వాడీలు సమస్యలతో పోరాడుతున్న నేపథ్యం అందరికీ తెలిసిందే. 2024 సార్వత్రిక ఎన్నికల రానున్న తరుణంలో అంగన్వాడీలు చేయిచేయూ కలిపి వినూత్న రీతిలో చేపట్టిన పోరాట పథాన్ని ఆకర్షించింది. రాష్ట్ర ప్రభుత్వం సైతం అంగన్వాడీల శాంతియుత దీక్షలను, నిరసనలను మౌనంగానే పరిశీలించింది. ఇటువంటి దీక్షాదీక్షలతో మరింత కలిసికట్టుగా ఉద్యమించాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పవచ్చు. రాష్ట్ర ప్రభుత్వం సైతం ఎన్నికల ఏడాది కావడంతో అంగన్వాడీల పోరాటాన్ని ఆమోదనీయమని గ్రహించినట్లు నటించినట్లు అర్థమవుతోంది. రాబోయే సుమారు పది నెలల వ్యవధిలో సార్వత్రిక ఎన్నికలు రానున్న నేపథ్యంలో పటిష్టమైన కార్యాచరణతో ఉద్యమాన్ని కొంతపుంతలు తొక్కించాల్సి ఉంది. తమ న్యాయద్దమైన డిమాండ్లను కలిసికట్టుగా ఉద్యమించడంద్వారా సాధ్యమవుతుందనే నమ్మకాన్ని అంగన్వాడీల్లో ప్రోదిచేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పవచ్చు. ఉద్యమ నాయకత్వం సైతం పోరాటాల ద్వారానే తమ న్యాయబద్ధమైన డిమాండ్లను సాధించుకునే అవకాశం ఉందని గ్రహించాల్సి ఉంది. ఉద్యమ తీవ్రతను మరింత క్రియాశీలం చేయాల్సిన అవసరం ఉంది. ఇందుకు అవస రమైన మరిన్ని సమరశీల పోరాటాల అమలుకు ఉద్యమ ప్రణాళికకు రూపకల్పన చేసి కార్యాచరణకు చిత్తశుద్ధితో ఉపక్రమించాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పవచ్చు.

- ప్రజాశక్తి- కడప ప్రతినిధి

ముత్తూరు రమణను పరామర్శించిన 'పుట్టా'

ప్రజాశక్తి - ఖాజీపేట

మండలంలోని పత్తూరు గ్రామ ఉప సర్పంచు ముత్తూరు రమణను కడప హిమాలయ ఆస్పత్రిలో శనివారం టిడిపి మైదుకూరు ఇన్‌ఛార్జి పుట్టా సుధాకర్ యాదవ్ పరామర్శించారు. రమణ ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడ్డాడు. ప్రమాదానికి గల కారణాలను పుట్టా అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులకు సూచించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు రామానాయుడు, మిల్లు శీను పాల్గొన్నారు.



రమణను పరామర్శిస్తున్న పుట్టా సుధాకర్ యాదవ్

ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

రాష్ట్రంలో ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేయాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ డిమాండ్ చేశారు. శనివారం ప్రొద్దుటూరులో నిరుద్యోగులతో కలిసి ఉద్యోగాల భర్తీకి ఉద్యమిద్దాం అని జిల్లా కమిటీ ముద్రించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వస్తే ఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తానని, ఏటా డీఎస్సీ విడుదల, గ్రూప్-2 నోటిఫికేషన్, ఖాళీ పోస్టులు భర్తీ చేస్తామని ప్రస్తుతం సిఎం జగన్ చెప్పారన్నారు. అనంతరం ఆయన నిరుద్యోగులకు పంగనామాలు పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఖాళీ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలని, ఎస్ఐ, కానిస్టేబుల్ ప్రిలిమ్స్ క్వాలిఫై అభ్యర్థులకు ఈవెంట్స్ నిర్వహించాలని కోరుతున్నామన్నారు. లేని పక్షంలో వారితరపున డివైఎఫ్ఐ పోరాడుతుందన్నారు. కార్యక్రమంలో డేవిడ్‌రాజ్, నిరుద్యోగులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

చక్రాయపేట : మండలంలోని గండిక్షేత్రం వీరాంజనేయస్వామి ఆలయంలో శాశ్వత నిత్యాన్నదాన పథకానికి దాత ఒక లక్ష రూపాయలు విరాళం ఇచ్చారని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ అలవలపాటి ముకుందా రెడ్డి, చైర్మన్ పినిపోలు రాఘవేంద్ర ప్రసాద్ తెలిపారు. శని వారం ప్రొద్దుటూరు వాస్త వ్యులు నందం జువెలర్స్ అధినేత నందం జయ రామ్, ఆయన భార్య అరుణ కుటుంబ సభ్యులు రూ.1,00,116 విరాళం ఇచ్చినట్లు వివరించారు. వీరికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేయించి, స్వామివారి శేష వస్త్రం, తీర్థప్రసాదాలు అందజేశారు.



చెక్కును అందజేస్తున్న దాత

జూనియర్ కళాశాలను తరలించొద్దు

- ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు గండి సునీల్‌కుమార్

బ్రహ్మంగారిమఠం : మండలంలోని గురుకుల పాఠశాలలో ఉన్న జూనియర్ కళాశాల విద్యార్థులను తరలించడాన్ని ఆపాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే రఘురామిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన ఎమ్మెల్యేను ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు గండి సునీల్‌కుమార్ కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురుకుల పాఠశాల 1984లో ప్రారంభించారని, 1995లో కడప జిల్లాలో మొదటిసారిగా బాలుర కోసం జూనియర్ కళాశాలను బ్రహ్మంగారిమఠంలో దళిత పేద వర్గాల విద్యార్థులు ఉన్నతస్థానానికి ఎదగడానికి నియర్ కళాశాలను ఏర్పాటు చేశారని తెలిపారు. గురుకుల కళాశాల తరలింపు ఆపి యథావిధిగా ఇక్కడే తరగతులను కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు ఎర్రపల్లి అజయ్, మండల కమిటీ సభ్యులు అల్లూరి సందీప్, అరవింద్, దేవా, రాహుల్, ప్రేమ్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

హత్య కేసులో నిందితుడి అరెస్టు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

కానపల్లి ఎస్‌సి కాలనీకి చెందిన ఆకుమల్ల నాగేంద్రబాబును హత్య కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్లు జమ్మలమడుగు డిఎస్‌పి నాగరాజు తెలిపారు. మృతుని భార్య ఆకుమల్ల నందు అలియాస్ ఇమాంబీ ప్రొద్దుటూరు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుడిని అరెస్టు చేసినట్లు నాగరాజు తెలిపారు. డిఎస్‌పి నాగరాజు ఆధ్వర్యంలో ప్రొద్దుటూరు త్రీటౌన్ ఇన్‌స్పెక్టర్ టి.నారాయణ యాదవ్, ప్రొద్దుటూరు టూటౌన్ ఇన్‌స్పెక్టర్ జి.ఇబ్రహీం కేసును అన్నికోణాల్లో దర్యాప్తు చేసి, శనివారం సాయంత్రం ఆకుమల్ల నగేష్, ఒక మహిళను అదుపులోకి తీసుకొని విచారించగా.. ఒక మహిళతో మృతుడు ఆకుమల్ల నాగేంద్రబాబుకు, ఆకుమల్ల నగేష్‌కు వివాహేతర సంబంధం ఉన్నట్లు తెలిపారు. నగేష్‌ను దగ్గరకు రానీయవద్దని, నగేష్‌ను నీ దగ్గరకు రానిస్తే చంపేస్తానని నాగేంద్రబాబు ఆ మహిళను బెదిరించినందున, నాగేంద్రబాబును ఎలాగైనా చంపి తమకు అడ్డుతొలగించుకోవాలని నగేష్ ఆ మహిళ కుట్ర పన్నారన్నారు. ఈనెల 13న తేదీ రాత్రి కనపల్లి ఎస్సీ కాలనీలో గంటా మరియమ్మ ఇంటిపై నిద్ర పోతున్న ఆకుమల్ల నాగేంద్రబాబును ఈనెల 14న తెల్లవారుజామున నగేష్ కత్తితో నాగేంద్రబాబును గొంతు కోసి చంపినట్లు నేరాన్ని అంగీకరించారని తెలిపారు. కేసును అతి చాకచక్యంగా విచారించిన ప్రొద్దుటూరు త్రీటౌన్ ఇన్‌స్పెక్టర్ టి.నారాయణ యాదవ్, టూ టౌన్ ఇన్‌స్పెక్టర్ జి.ఇబ్రహీం వారికి సహకరించిన ప్రొద్దుటూరు రూరల్ ఎస్ఐలు కె.చిరంజీవి, బి.శివ ప్రసాద్, హెడ్ కానిస్టేబుల్ నాగ, సాయిప్రసాద్ సిబ్బందిని అభినందించారు.



నిందితుడ్ని అరెస్ట్ చేసిన పోలీస్ అధికారులు

ఎర్రచందనం కేసులో మరో వ్యక్తి ..

ప్రజాశక్తి - ఖాజీపేట

మండల పరిధిలోని పుల్లూరు సమీపంలో కడప-కర్నూలు జాతీయ రహదారిపై ఎర్రచందనం దుంగల అక్రమ తరలింపు కేసులో పరారీలో ఉన్న నిందితుడ్ని అరెస్టు చేసినట్లు ఎస్ఐ రాజరాజేశ్వరరెడ్డి తెలిపారు. అట్లూరు మండలం రెడ్డిపల్లి గ్రామానికి చెందిన సి.కేశవను శనివారం అరెస్టు చేశామన్నారు. ఎస్‌పి ఆదేశాల మేరకు మైదుకూరు డిఎస్‌పి వంశీధర్ గౌడ్ ఆధ్వర్యంలో మైదుకూరు రూరల్ ఇన్‌ఛార్జి సిఐ చలపతి పర్యవేక్షణలో అరెస్టు చేశామన్నారు. అనంతరం ఎస్ఐ మాట్లాడుతూ ఎర్రచందనం అక్రమ రవాణాకు సంబంధించి సమాచారం ఉంటే ఎవరైనా పోలీసులకు తెలపాలని కోరారు.

జూదమాడుతూ పది మంది..

ప్రజాశక్తి - చక్రాయపేట

మండలంలోని గంగారపువాండ్లపల్లె-గొట్లమెట్ల మార్గమధ్యంలో ఉన్న అడవుల్లో పదిమంది జూదరులను అరెస్టు చేసి, వారి నుంచి లక్ష నాలుగు వేల రూపాయలు స్వాధీనం చేసుకున్నట్లు సిఐ గోవిందరెడ్డి తెలిపారు. జూదం ఆడుతున్నారని సమాచారంతో చక్రాయపేట పోలీసులు దాడి చేశారన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.

నకిలీ విలేకరిపై కేసు నమోదు

ప్రజాశక్తి - కొండాపురం

నకిలీ విలేకరిపై కొండాపురం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. మండలంలోపి ఎస్.తిమ్మాపురం గ్రామానికి చెందిన మంజుల శ్రీనివాసులు కొంతకాలంగా ప్రజాశక్తి దినపత్రిక విలేకరినంటూ చెప్పుకుంటూ అధికారులను బెదిరిస్తున్నారని తన దృష్టికి రావడంతో సదరు పత్రిక స్థానిక విలేకరి వెల్లాల లింగేశ్వరరెడ్డి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఆ మేరకు మంజుల శ్రీనివాసులును అదుపులోకి తీసుకొని తహశీల్దార్ ఎదుట హాజరు పరిచామన్నారు. తహశీల్దార్ విచారించి బైండోవర్ కేసు నమోదు చేసి, సొంత పూచీకత్తుపై విడుదల చేసినట్లు తహశీల్దార్ శోభన్‌బాబు తెలిపారు.

పని ఎక్కువ.. సిబ్బంది తక్కువ

రోజురోజుకూ పెరుగుతున్న నేరాలు - ఆందోళనలో ప్రజలు

ప్రజాశక్తి - కొండాపురం

జిల్లాలోని అతిపెద్ద మండలం రైల్వే కొండాపురం. ఈ మండలం పేరు వినని వారుండరు. ఒకప్పుడు ఫ్యాక్షన్ మండలంగా ఉండేది. జమ్మలమడుగు నియోజకవర్గం రాజకీయాలకు తలలోని నాలుక వంటిది. ఎందరో రాజకీయ నాయకుల జీవితాలను మార్చేసిన ఘనత కొండాపురం మండలాని ఉంది. అయితే కొండాపురం పోలీసుస్టేషన్‌లో మూడేళ్లుగా సిబ్బంది కొరత వేధిస్తోంది. దీంతో నేరాల సంఖ్య కూడా పెరుగుతూ వస్తోంది. ఈ విషయాన్ని ఎస్‌పి కెకె ఎన్.అన్బురాజన్ దృష్టికి తీసుకెళ్లినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదు. పోలీస్‌స్టేషన్‌లో సిబ్బంది కొరత వల్ల పట్టణంలో దొంగల బెడద ఎక్కువైంది. తగినంత పోలీసు సిబ్బంది లేక రాత్రివేళ పోలీసు గస్తీ కరువైంది. ప్రజలు బంగారు, డబ్బులు పోగొట్టుకున్నారు. ఈ నేపథ్యంలో కొండాపురం ప్రజల్లో భయాందోళనలు నెలకొని ఉన్నాయి. అంతేకాక ఇక్కడ రైల్వేస్టేషన్ ఉండడం వల్ల పోలీసు గస్తీ తప్పనిసరిగా అవసరం. మట్కా, పేకాట, బెల్ట్ షాపులు, డ్రంక్ అండ్ డ్రైవ్ వంటి అసాంఘిక కార్యకలాపాలు ఎక్కువగా ఉన్నాయనే ఆరోపణలున్నాయి. జాతీయ రహదారిపై కావడంతో వాహనాల రాకపోకలు కూడా ఎక్కువే. ఇందులో అక్రమ రవాణా జరిగే అవకాశాలు లేకపోలేదనే చర్చలు సాగుతున్నాయి. పోలీస్‌స్టేషన్‌లో తగిన సిబ్బంది లేకపోవడంతో ఉన్న పోలీసులు ఇలాంటివాటిపై దృష్టి సారించలేకపోతున్నారని పలువురు పేర్కొంటున్నారు.

పోలీసు స్టేషన్‌లో.. ఉండాల్సిన ఉద్యోగులు : ఒక సిఐ, ఒక ఎస్ఐ, ఇద్దరు ఎఎస్ఐలు, ఆరుమంది హెడ్ కానిస్టేబుళ్లు, 18 మంది కానిస్టేబుళ్లు.



కొండాపురం పోలీసుస్టేషన్

ప్రస్తుతం ఉన్న ఉద్యోగులు : ఒక సిఐ, ఒక ఎస్ఐ (ఇన్‌ఛార్జి), ఇద్దరు ఎఎస్ఐలు, ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్లు, మరో ఇద్దరు కానిస్టేబుళ్లు. ఇందులో ఒక ఎఎస్ఐ, ఒక హెడ్ కానిస్టేబుల్ ప్రొద్దుటూరు నుంచి విధులకు హాజరుకావాల్సి ఉంది. వారు విధులకు ఎప్పుడు వస్తారో.. ఎక్కడ పనిచేయుచున్నారో.. ఎక్కడ జీతాలు తీసుకుంటున్నారో జిల్లా పోలీసు అధికారులకు తెలియాలని స్థానికులు పేర్కొంటున్నారు. తగిన సిబ్బందిని జిల్లా అధికారులు ఎందుకు నియమించలేకపోతున్నారోనని ప్రజలు చర్చించుకుంటున్నారు. త్వరలో జరగనున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని కొండాపురం పోలీసుస్టేషన్‌లో పూర్తిస్థాయిలో సిబ్బందిని నియమించాలని, ప్రశాంత వాతావరణం కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

అనుసంధాన రోడ్ల నిర్మాణానికి చర్యలు



సర్వాయపల్లె వద్ద అప్రోచ్ రోడ్డు అభివృద్ధికి చేపట్టిన పనులు

ప్రజాశక్తి - చాపాడు

కడప-కర్నూలు ప్రధాన రహదారికి అనుసంధానంగా ఉన్న రోడ్లు పలుచోట్ల అధ్వానంగా ఉన్నాయి. ముఖ్యంగా మైదుకూరు వద్ద సర్వాయపల్లి-మసీదు రోడ్డు నుండి హైవేకు వచ్చే ప్రదేశం చాలా అధ్వానంగా తయారైంది. ఈ రోడ్లను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు హైవే అధికారులు చర్యలు చేపట్టారు. రోడ్డు మొత్తం గుంతల మయంగా మారి ప్రయాణికులకు తీవ్ర అసౌకర్యంగా మారింది. చిన్నపాటి వర్షానికే ఈ మార్గం చాలా బురదగా మారి పాదచారులు కూడా పోలేని పరిస్థితి. అలాగే చాపాడు మండలం ద్వారకానగరం, సిద్ధారెడ్డిపల్లి గ్రామాలకు వెళ్లే అనుసంధాన రోడ్లు కూడా అస్తవ్యస్తంగా ఉన్నాయి. మున్సిపాలిటీ పరిధిలోని హైవే రోడ్డు నిర్మించిన తర్వాత అనుసంధాన రోడ్లు పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడాల్సి వచ్చేది. అనుసంధాన రోడ్డు వద్ద లైటింగ్ ఏర్పాటు చేస్తే ప్రయాణికులకు ఉపయోగకరంగా ఉం టుంది. మైదుకూరు-ప్రొద్దుటూరు ప్రధాన రహదారి నుంచి కడప-కర్నూ లు ప్రధాన రహదారికి ఈ మధ్య కాలంలోనే అప్రోచ్ రోడ్డు ఏర్పాటు చేశారు. గతంలో ఈ మార్గంలో ప్రయాణికులు చాలా ఇబ్బందులు పడేవారు. ఈ ప్రాం తంలో ప్రస్తుతం సూచిక బోర్డులు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. ప్రొద్దుటూరు రోడ్డు బ్రిడ్జి వద్ద సూచిక బోర్డు లేక ప్రమాదాలు జరుగు తు న్నాయి. కడప-కర్నూలు ప్రధాన రహదారి నుండి అప్రోచ్ రోడ్లు, సూచిక బోర్డులు, లైటింగ్ వ్యవస్థను అభివృద్ధి చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

కెనరా బ్యాంక్ మేనేజర్‌ను సస్పెండ్ చేయాలి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

స్థానిక ప్రొద్దుటూరు రోడులో ఉన్న కెనరా బ్యాంక్ యాజమాన్యం ప్రజల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదని, బ్యాంక్ మేనేజర్‌ని సస్పెండ్ చేయాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ పేర్కొన్నారు. శనివారం బ్యాంక్ వద్ద ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం శివకుమార్ మాట్లాడుతూ శుక్రవారం మధ్యాహ్నం నుండి శనివారం మధ్యాహ్నం వరకు కెనరా బ్యాంక్‌లో కరెంటు లేదని ఖాతాదారులను వెనక్కి పంపిస్తున్నారన్నారు. శనివారం ఉదయం నుండి ఖాతాదారులు బయట ఎండలో గంటల తరబడి ఉన్నాన్నారు. బ్యాంకు గేట్లు వేసి వారిని బయట వెయిట్ చేయించడం దారుణమన్నారు. జెనరేటర్ సౌకర్యం, బ్యాటరీ ఇన్వర్టర్ సౌకర్యం లేకపోవడం ఘోరమన్నారు. సమస్యపై ఖాతాదారులు అడిగితే బ్యాంక్ మేనేజర్ నిర్లక్ష్యంగా ముందు మీరు ఫిక్స్ డిపాజిట్ చేయండని వేటకారపు సమాధానాలు ఇవ్వడం ఏంటని ప్రశ్నించారు. బ్యాంకు మేనేజర్ మాత్రం ఉచిత సలహాలిస్తూ వ్యంగ్యంగా ఉన్నతాధికారులకు చెప్పాం.. తమకు సంబంధం లేదని చెబుతున్నారని విమర్శించారు.



ఖాతాదారులతో బ్యాంక్ వద్ద నిరసన తెలుపుతున్న డివైఎఫ్ఐ శివకుమార్




మినీ మ్యానిఫెస్టోను ప్రజలకు వివరిస్తున్న భూపేష్‌రెడ్డి

ఎన్నికల్లో టిడిపిని గెలిపించాలి

ప్రజాశక్తి - మైలవరం

మండల పరిధిలోని గొల్లపల్లి గ్రామంలో శనివారం నిర్వహించిన భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో జమ్మలమడుగు టిడిపి ఇన్‌ఛార్జి చదిపిరాళ్ళ భూపేష్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రతి ఇంటికి తిరుగుతూ మినీ మ్యానిఫెస్టోను ప్రజలకు వివరించారు. అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన జగన్మోహన్‌రెడ్డి పేద, మధ్య తరగతి వాళ్లకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని వివరించారు. రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనకు ఓటు వేసి గెలిపించాలన్నారు. కార్యక్రమంలో కొండయ్య యాదవ్, పాపిరెడ్డి, నరసింహులు, రామ్మోహన్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, బ్యాంకు నరసింహులు, పాములేటి, ప్రసాద్, నరేష్, సుధీర్, సురేష్, సుబ్బరాయుడు, మహేష్, సలీం, అంజన్ కుమార్, దస్తగిరి, ప్రతాప్, రామయ్య, పార్టీ నాయకులు, కార్యకర్తలు, దేవగుడి కుటుంబ అభిమానులు పాల్గొన్నారు. **దువ్వూరు :** మండలంలోని చింత కుంట, బయనపల్లె గ్రామాల్లో శనివారం టిడిపి ఇన్‌ఛార్జి పుట్టా సుధాకర్ యాదవ్ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమంపై ప్రజల్లో అవగాహన పెంచేందుకే నిర్వహిస్తున్నామన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే చేసే కార్యక్రమాలను ఆయన ఇంటింటికి తిరిగి ప్రజలకు వివరించారు. ఒక్కసారి మాకు అవకాశం ఇస్తే తమ ప్రభుత్వం చేసే పనులను మీరే గుర్తిస్తారని పుట్టా కోరారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ బోరెడ్డి రమణారెడ్డి,రైతు నాయకుడు కారపురెడ్డి సంజీవరెడ్డి, చింతకుంట మాజీ సర్పంచ్ హుస్సేన్‌షా, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



విశ్వేశ్వర్‌రెడ్డి ప్రమాణ స్వీకారంలో ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి, తిరుపేల్‌రెడ్డి

సింగిల్ విండో ప్రెసిడెంట్‌గా విశ్వేశ్వర్‌రెడ్డి ప్రమాణం

ప్రజాశక్తి - దువ్వూరు

సింగిల్ విండో ప్రెసిడెంట్‌గా ప్రమాణస్వీకారం చేసిన ఇరగంరెడ్డి విశ్వేశ్వర్‌రెడ్డికి ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి అభినందనలు తెలిపారు. ఆయన ప్రమాణ స్వీకారానికి శనివారం ఎమ్మెల్యే విచ్చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ సలహాదారులు ఇరగంరెడ్డి తిరుపేల్‌రెడ్డి, ఎంపిపి కానాల జయచంద్రారెడ్డి, దువ్వూరు సర్పంచు చేన్న రాయుడు, మండల కన్వీనర్ చిరాకి బాషా, బ్యాంకు మేనేజర్ రవీంద్రారెడ్డి, సుబ్బారెడ్డి పాల్గొన్నారు

పారిశుధ్య కార్మికులను పర్మినెంట్ చేయాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు

ముఖ్యమంత్రి ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ విభాగంలో పనిచేస్తున్న మున్సిపల్ వర్కర్స్ ను పర్మనెంట్ చేస్తామని ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని సిఐటియు మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కమిటీ సభ్యుడు విజయ్‌కుమార్ కోరారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శనివారం మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డికి వినతిపత్రమిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారు 40 వేల మంది మున్సిపల్ కార్మికులు 123 మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లు, నగర పంచాయితీల్లో పని చేస్తున్నారని తెలిపారు. వీరికి సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం చెల్లించడం లేదన్నారు. గతంలో అనేక తీర్పుల్లో కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ కార్మికులకు టైంస్కేల్ అమలు చేయాలని హైకోర్టు ఆదేశాలు ఇచ్చినా నేటికి అమలు కావడంలేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నెల 20 నుంచి ఆగస్ట్ 7వ తేదీ వరకు రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు అన్ని నగర పంచాయితీలో నిరసన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శి నాగన్న, శేఖర్, కోశాధికారి శివ, ప్రతాప్, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

ఉత్పత్తిదారుల సంఘాలకు రుణ సాయం

వేంపల్లె : సుస్థిర వ్యవసాయ కేంద్రం ఆధ్వర్యంలో చేపడుతున్న ఉత్పత్తిదారుల సంఘాలకు బ్యాంకుల నుండి రుణ సదుపాయం కల్పిస్తామని డిసిసి బ్యాంకు సిఇఒ రాజేంద్రకుమార్ చెప్పారు. శనివారం వేంపల్లెలో సుస్థిర వ్యవసాయ కేంద్రం అధ్వర్యంలో నిర్వహిస్తున్న గాయత్రి మహిళ రైతుల సహకార సంఘం, వేంపల్లి రైతు ఉత్పత్తిదారుల సంఘంను ఆప్కాబ్, డిసిసిబి బ్యాంక్ అధికారులు పరిశీలించారు. అలాగే సుస్థిర వ్యవసాయ కేంద్రం సహకారంతో ఏర్పాటు చేయించిన సోలార్ డ్రైయార్ ద్వారా చేస్తున్న ఉత్పత్తుల తయారీ, పప్పు ధాన్యాల పిండి మిషన్, మిల్లెట్ ప్రాసెసింగ్ మిషన్, తేనెటీగల పెంపకం, కూరగాయల విత్తనాలు, ఆహార ఉత్పత్తులను పరిశీలించి వ్యాపార లావాదేవీల రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్‌పిఒల వ్యాపార అభివృద్ధికి కావలసిన రుణాలను తక్కువ వడ్డీలతో అందిస్తామని తెలిపారు. సిఎస్ఎ రాష్ట్ర కో-ఆర్డినేటర్ అదినారాయణ మాట్లాడుతూ తమ సంస్థ నుండి జిల్లాలో 10 ఎస్‌పిఒలు ఉన్నట్లు తెలిపారు. వేంపల్లె, గాయత్రి ఎస్ పిఒలకు రూ.10 లక్షల రుణాలు మంజూరు చేస్తామని ఆప్కాబ్ సిజిఎం రాజయ్య అన్నారు. సిజిఎం వెంకటరత్నం, అప్కాబ్, డిసిసిబి, సిఎస్ఎ, ఎస్‌పిఒ సిబ్బంది, పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

చాపాడు : మండల పరిధిలోని ఖాదర్‌పల్లిలో శనివారం ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఆధ్వర్యంలో రైతులకు పురుగుల, తెగుళ్ళ నివారణ, ఎరువుల వాడకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ సిబ్బంది మునిలక్ష్మీ, రామాంజనేయులు మాట్లాడుతూ ముందుగా పంటల సాగులో మంచి విత్తనం ఎంపిక, విత్తనశుద్ధి ముఖ్యమన్నారు. నవధాన్యాలు సాగు, పంట ప్రణాళిక, పంట ఎదుగుదల, తెగుళ్ళ నివారణలో ఖర్చు లేకుండా చర్యలపై అవగాహన కల్పించారు. పంట గెట్లపైన పండ్ల చెట్లు, బంతి మొక్కలు సాగు చేయడం వల్ల అదనపు అధాయం చేకురుతుందన్నారు. పంటల నాణ్యత, మార్కెట్ పైన రైతులకు వివరించారు. ద్రవ జీవా మృతాన్ని రైతులతో చేయించారు. కార్యక్రమములో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయమని మున్సిపల్ వైసిపి ఇన్‌ఛార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ వి.వరప్రసాద్ తెలిపారు. శనివారం పట్టణ పరిధిలోని అంకాలమ్మపేట వార్డు సచివాలయంలో నిర్వహించిన సురక్ష కార్యక్రమంలో వారు మాట్లాడుతూ 1,223 మందికి వివిధ రకాల ధ్రువీకరణ, ఆదాయ, వివాహ, జనన వంటి 11 రకాల పత్రాలను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ హాఫీజ్, కమిషనర్ నరసింహారెడ్డి, కౌన్సిలర్లు లక్ష్మిభార్గవి, లక్ష్మి ప్రసన్న, కొండలరావు, రాష్ట్ర సివిల్ సప్లయ్ డైరెక్టర్ హాల్ గంగాధరరెడ్డి, జగనన్న కన్వీనర్లు, గృహ సారథుల ఇన్‌ఛార్జి చంద్రమౌళి, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

చాపాడు : జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సచివాలయాల కన్వీనర్‌ల మండల కన్వీనర్ రామ్మోహన్‌రెడ్డి కోరారు. చిన్నగురువలూరులో శనివారం జగనన్న సురక్ష గ్రామసభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలు ఉచితంగా అందుతున్నాయన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ సుభానీ, ఐసిడిఎస్ సిడిపిఒ సావిత్రమ్మ, సూపర్వైజర్ రాజ్యలక్ష్మి, ఎఒ రామాంజనేయులు, ఎంపిటిసి ఎం.పార్వతమ్మ, కుచ్చుపాప సర్పంచు సుబ్బారెడ్డి, ఎల్లారెడ్డి పాల్గొన్నారు.

జమ్మలమడుగు రూరల్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నామని మండల ప్రత్యేక అధికారి వెంకటరామిరెడ్డి అన్నారు. శనివారం పి.బొమ్మేపల్లి గ్రామ సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సర్పంచు గుణకనపల్లి రామనాథ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. బొమ్మేపల్లి, అంబవరం, గండికోట గ్రామ పంచాయతీలకు సంబంధించిన 388 మంది వివిధ రకాల ధ్రువ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి చంద్రశేఖర్‌రెడ్డి, ఆయా గ్రామ పంచాయతీ సెక్రటరీలు శివమహేంద్రరెడ్డి, మండల అధికారులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

బ్రహ్మంగారిమఠం : ప్రజల కోసమే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తోందని ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి తెలిపారు. శనివారం మండల కేంద్రంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ వీరానారాయణరెడ్డి, సర్పంచ్ రామయ్య, ఎంపీటిసిలు ఈశ్వర్ రెడ్డి, అంకిరెడ్డి, ఎంపీడీఓ వెంగమునిరెడ్డి, తహశీల్దార్ సువర్ణ దేవి, సచివాలయ సిబ్బంది, గృహ సారథులు, వాలంటీర్లు, ప్రజలు పాల్గొన్నారు.

వేంపల్లె : జగనన్న సురక్ష గ్రామసభల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్నట్లు తహశీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. శనివారం మండలంలోని అలిరెడ్డిపల్లె గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా లబ్ధిదారులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. అనంతరం గ్రామంలో ఉన్న సమస్యలను తహశీల్దార్ దృష్టికి మాజీ సర్పంచు నాగసుబ్బారెడ్డి తెచ్చారు. కార్యక్రమంలో ఎఒ సోమశేఖర్‌రెడ్డి, సర్పంచు నాగరాజు, సచివాలయ కన్వీనర్లు చంద్రశేఖర్‌రెడ్డి, వెంకట నారాయణరెడ్డి, మార్కెట్ యార్డు కమిటీ డైరెక్టర్ రామకృష్ణారెడ్డి, ఎంపిటిసి ప్రదీప్‌కుమార్‌రెడ్డి, ఉప సర్పంచు శివశంకర్, మాజీ సర్పంచు నాగ సుబ్బారెడ్డి, గృహసారథులు, ప్రజలు పాల్గొన్నారు.

ప్రజలకు మేలు చేసేలా కాంగ్రెస్ మేనిఫెస్టో

- పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోను పోలిస్తే టిడిపి, వైసిపివి ఏ మాత్రం సరికావని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి అన్నారు. శనివారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెసు పార్టీ అధికారంలోకి వస్తే 6 సూత్రాల కార్యక్రమాన్ని అమలు చేస్తారని తెలిపారు. రూ.6 లక్షల వరకు వ్యవసాయ రుణాలు మాఫీ చేస్తారన్నారు. రూ.500కే గ్యాస్ సరఫరా చేస్తామని తెలిపారు. ప్రతి నిరుపేద కుటుంబానికి నెలకు రూ.6వేలు ఆర్థికసాయం అందిస్తారన్నారు. అలాగే ప్రత్యేకహోదా అమలు చేస్తారని ఆయన పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు ఆలోచించి కాంగ్రెస్ పార్టీని ఆదరించాలని కోరారు.

రేపు క్యాంపస్ ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

స్థానిక సాయిపరమేశ్వర డిగ్రీ కళాశాలలో సోమవారం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామని ఆ కళాశాల కరస్పాండెంట్ పాలా నాగేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఆ మేరకు శనివారం ఆయన డిగ్రీ కళాశాలలో మాట్లాడుతూ ఇపి సోర్స్ కంపెనీ ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. డిగ్రీలో లైఫ్ సైన్స్, హెల్త్ సైన్స్ చేసిన విద్యార్థులకు మంచి ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని జమ్మలమడుగు నియోజకవర్గంలోని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.



కరపత్రాలను విడుదల చేస్తున్న సిఐటియు ఆటో యూనియన్ నాయకులు

సిఐటియు పట్టణ మహాసభలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - జమ్మలమడుగు

జమ్మలమడుగు పట్టణ 1వ మహాసభలను ఈనెల 19,20న నిర్వహిస్తున్నామని, జయప్రదం చేయాలని శనివారం స్థానిక ఎన్జీవో కార్యాలయంలో సిఐటియు వర్కర్స్ యూనియన్ పట్టణ నాయకుడు దాసరి విజయ్ కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత కార్మిక ఉద్యమంలో అగ్రభాగాన ఉన్న సిఐటియు 1970లో కలకత్తా నగరంలో స్థాపించారన్నారు. ఐక్యత-పోరాటం అనే నినాదంతో ఏర్పడిన సిఐటియు కార్మికుల పోరాటాలను ఉధృతం చేయడానికి దేశవ్యాప్తంగా ఎనలేని కృషి చేసిందని తెలిపారు. మహాసభలకు సిఐటియు ఆల్ ఇండియా జనరల్ కౌన్సిలింగ్ మెంబర్, జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్, జిల్లా నాయకత్వం పాల్గొంటుందన్నారు. కార్యక్రమంలో సిఐటియు ఆటో స్టాండ్‌ల అధ్యక్ష, కార్యదర్శులు అబ్రహం, దస్తగిరి, సభ్యులు కమాల్ బాషా, రాజు దివాకర్, కృష్ణ, బాషా, అక్బర్. పాములేటి, రవి పాల్గొన్నారు.